వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఉపాధి పనులు చేస్తూ వడదెబ్బకు గురై ఉపాధి కూలీ మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంఇ. సన్నవిల్లికి చెందిన తొత్తరమూడి కాంతమ్మ (59) సోమవారం గ్రామంలోని ఉపాధి పనులకు వెళ్ళింది. ఉపాధి పనులు చేస్తూ ఉండగా వడదెబ్బకు గురవడంతో కాంతమ్మను అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కాంతమ్మ మృతి చెందింది. కాంతమ్మకు సర్పంచ్ చిక్కం పెదబాబు, ఉపాధి ఇసి ఎం.వీరబాబు, టిఎ కె.బాలరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ కాశి శ్రీరామ్, తొత్తరమూడి విజయకుమార్, ప్రశాంత్ కుమార్ నివాళులర్పించారు.

కాంతమ్మ (ఫైల్ ఫోటో)

ట్రాఫిక్ సమస్యతో జనం అవస్థలు

ప్రజాశక్తి-అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏర్పడి మూడేళ్లు పూర్తవుతోంది. అయినా ఇంకా జిల్లాకు బాలారిష్టాలు తప్పడం లేదు. ప్రధానంగా ట్రాఫిక్ సమస్య పట్టణంలో జటిలంగా మారింది. అమలాపురం జిల్లా కేంద్రంగా మారినా ట్రాఫిక్ సమస్య పట్టణాన్ని పట్టి పీడిస్తోంది. అమలాపురంలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రధానంగా ఇరుకు రహదారులు, నిబంధనలు పాటించని వాహన చోదకులు, సరైన పార్కింగ్ ప్రదేశాలు లేకపోవడం, రహదారిపైనే పార్కింగ్ చేయడం మరోవైపు రోడ్డుకిరువైపులా ఆక్రమణలు ప్రధాన కారణంగా ఉన్నాయి. వీటికి తోడు అమలాపురం పట్టణంలో హైస్కూల్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటైన షాపింగ్ మాల్స్‌తో ట్రాఫిక్ సమస్య మరింత ఇబ్బందిగా మారింది. దీంతో సాధారణ ప్రజలు ఏదైనా పనితో రోడ్డుపై అడుగు పెట్టాలంటే హడలెత్తిపోతున్నారు. ఏ ప్రధాన కూడలికి వెళ్లినా ఈ ట్రాఫిక్ వలయంలో చిక్కుకుని ఉక్కిరిబిక్కిరవ్వాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా అమలాపురం పట్టణంలో సుబ్బారాయుడు చెరువు నుండి హైస్కూల్ సెంటర్, శ్రీరాంపురం, ముస్లిం వీధి, ముమ్మిడివరం గేట్, నల్లవంతెన, ఎర్ర వంతెన, కె.అగ్రహారం, గడియార స్తంభం సెంటర్, ఆర్‌టిసి బస్టాండ్, ఈదరపల్లి వంతెన వంటి ప్రధాన రహదారుల్లో నిత్యం వాహనాలు నిలిచి ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారవుతోంది. నగరంలో ప్రధాన కూడళ్లలో సిగ్నల్ లైట్లు వ్యవస్థ ఏర్పాటు చేశారు కానీ సాంకేతిక కారణాలతో ఇంకా ప్రారంభించలేదు. ప్రస్తుతానికి ట్రాఫిక్ సిబ్బందితోనే ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. ప్రస్తుతం అమలాపురం పట్టణం జిల్లా కేంద్రం అయింది కనుక ప్రధాన కూడలలో సిగ్నల్ లైట్లు వ్యవస్థ పునరుద్ధరించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈదరపల్లి, నల్ల వంతెన, ఎర్రవంతెన ప్రాంతాల్లో ఇప్పుడున్న వంతెనలు కాకుండా అదనంగా మరో మూడు వంతెనలు నిర్మిస్తే ఈ ట్రాఫిక్ సమస్య చాలా వరకు పరిష్కారం అవుతుందని అధికారులకు తెలుసు కానీ ఆ విధంగా చర్యలు చేపట్టడం లేదు. మున్సిపాలిటీ వారు గతంలో రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించి రోడ్డు వెడల్పు చేసే పని ప్రారంభించినా మరలా ఆక్రమణదారులు యథావిధిగా రోడ్డుకి ఇరువైపులా ఉన్నా ఖాళీ స్థలంలో అక్రమణలు మొదలు పెట్టేశారు. ప్రధానంగా అమలాపురం పట్టణంలోకి ప్రవేశించడానికి ఈదరపల్లి వంతెన వద్ద నిత్యం ట్రాఫిక్ రద్దీతో వాహనాలు ఎక్కడకక్కడ గంటలకు నిలిచిపోతున్నాయి. సాయంత్రం వేళలో పట్టణంలో ఉన్న కళాశాలలు, పాఠశాలలకు చెందిన బస్సులు ఒకే సమయంలో రోడ్లపైకి రావడంతో సాయంత్రం వేళ ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. సరుకు తరలించే భారీ వాహనాలు పట్టణంలోకి అనుమతి లేకున్నా ట్రాఫిక్ సిబ్బంది చేతివాటంతో అక్కడక్కడా పట్టణంలోనికి ప్రవేశించి ట్రాఫిక్ సమస్యకు మరో కారణం అవుతున్నాయి. అమలాపురం పట్టణంలో రోడ్లు పూర్తిగా వెడల్పు చేయాలని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రధాన కూడళ్లలో సిగ్నల్ లైట్లు వ్యవస్థ మెరుగుపరచాలని వన్ వే నిబంధనలు అమలు చేస్తే కొంత ట్రాఫిక్ సమస్య తగ్గవచ్చు అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



అమలాపురం పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో నిలిచిపోయిన వాహనాలు

ఈదరపల్లి వంతెన వద్ద ఆక్రమణలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎ

ఈదరపల్లి వంతెన నిర్మాణానికి చర్యలు

పట్టణంలో ఇటీవల ట్రాఫిక్ రద్దీ పెరిగిన కారణంగా నూతన వంతెనల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. ఇటీవల ఈదరపల్లి వంతెన వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావుతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. వంతెనకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను వారు పరిశీలించి వంతెన నిర్మాణానికి ఏ విధమైన అడ్డంకులూ లేకుండా పూర్తిగా ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. వంతెన వద్ద రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణల వివరాలను ఆర్‌డిఒ, తహశీల్దారు, సర్వేయర్లు జిల్లా కలెక్టర్‌కు రికార్డుల ఆధారంగా వివరించారు. ఆక్రమణలను పూర్తిగా తొలగించి వచ్చే నెలలో నూతన వంతెన నిర్మాణాన్ని రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించనున్నట్టు కలెక్టర్ తెలిపారు.

నాణ్యతతో ప్రజా సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-అమలాపురం

ప్రజా సమస్యలను నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డిఆర్ఒ రాజకుమారి, డిఆర్‌డిఎ పీడీ సాయినాథ్ జయచంద్ర గాంధీ, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, ఎస్‌డిసి కృష్ణమూర్తి ప్రజల నుంచి సుమారు 300 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఒకసారి సమర్పించిన అర్జీ మరలా అదే అంశంపై పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు నిర్ణీత సమయంలో ప్రజా ఫిర్యాదుల సమస్యలను పరిష్కరించి గడువు దాటిన అర్జీలు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రజలకు అందిస్తున్న సేవల్లో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్‌ను నిర్లక్ష్యం చేయకుండా ప్రజలు పెట్టుకున్న అర్జీలను, ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరిస్తూ సంతృప్త స్థాయిలను పెంచాలని ఆదేశించారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలపై పిజిఆర్ఎస్ వెబ్‌సైట్ ద్వారా నిత్యం పరిశీలిస్తూ నిర్ణీత సమయంలో పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అర్జీనీ క్షేత్రస్థాయిలో పూర్తిగా విచారించి సమస్యకు సూటిగా పూర్తిస్థాయిలో పరిష్కారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ సిహెచ్ఎన్‌వి.కృష్ణారెడ్డి, డిపిఒ శాంతి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ దుర్గారావు దొర, డిసిహెచ్ఎస్.కార్తీక్, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, ఎఒ కాశీ విశ్వేశ్వరరావు,

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

ఘనంగా వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం వెంకటేశ్వర స్వామి కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న ఆధ్వర్యంలో ట్రస్ట్ బోర్డ్ సభ్యులు మోకా వెంకట సుబ్బారావు, దున్నాల వేణు, గన్నవరపు సూర్యభాస్కర రావు, దున్నాల దుర్గ, గోకరకొండ లక్ష్మణరావు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇఒ యర్రా వెంకటేశ్వరరావు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. ఇందుగులు శ్రీనివాస్, టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, మున్సిపల్ ప్రతిపక్షం నేత ఏడిద శ్రీను, దెందుకూరి సత్తిబాబు రాజు, తిక్కిరెడ్డి నేతాజీ, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, బోనం సత్తిబాబు, ర్యాలి వెంకట్రావు, పుప్పాల సత్తిబాబు, పడాల శ్రీదేవి పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి కల్యాణంలో పాల్గొన్న మంత్రి వాసంశెట్టి సుభాష్

డ్రెయినేజీల్లో పూడిక తొలగించాలి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని పలు గ్రామాల్లో డ్రైన్లలో పూడికను తొలగించాలని స్థానిక కోరుతున్నారు. గ్రామంలో పలు వీధుల్లోని డ్రైన్లు అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగునీరు ముందుకు పారుదల లేక ఎక్కడ మురుగు అక్కడే ఉంటోంది. దీంతో దోమలు విపరీతంగా పెరగడంతో పాటు డ్రైన్లులో మురుగునీరు నిల్వ ఉండడంతో దుర్గంధం భరించలేకపోతున్నామని స్థానిక వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి మీదుగా వెళ్లాలంటే ఉక్కు మూసుకుని వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి మురుగు డ్రైన్లలో పూడికను తొలగించి దోమల నివారణకు మందు స్ప్రే సేయించే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మురుగునీరు పారుదల లేని డ్రెయిన్

తాగునీటి సమస్యపై అధికారుల పర్యటన

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-రామచంద్రపురం

గంగవరం మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్యపై ప్రజాశక్తిలో వెలువడిన కథనాలపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించారు. మండలంలోని యర్రపోతవరంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ రామారావు, ఎఇ రాహుల్ పర్యటించారు. గ్రామంలో మెయిన్‌లైన్ నుంచి ఎర్ర పోతవరంలోని దళితవాడలకు తాగునీరు రాకపోవడాన్ని వారు గుర్తించారు. గ్రామంలో బుడగ జంగాల కాలనీకి, కుడుపూరు వారి కొంపలకు, పంపనవారిపాలెంకు తాగునీరు సరఫరా లేకపోవడంతో గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. జల్‌జీవన్ మిషన్‌లో గ్రామానికి మంజూరైన నిధులతో రాళ్లగుంట వరకు పైప్‌లైన్ వేశారని, మిగిలిన ప్రాంతాల్లో పైప్‌లైన్లు వేయాల్సి ఉందని అధికారులు గుర్తించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి జలజీవన్ మిషన్లో మిగిలిన ప్రాంతాలకు పైప్ లైన్లు వేసి మంచినీటి సరఫరా పునరుద్ధరించి చర్యలు చేపడతామని అధికారులు వివరించారు.

కార్మికులను వివరాలు అడుగుతున్న అధికారి

గ్రామ కార్యదర్శి, ఉప సర్పంచ్‌తో మాట్లాడుతున్న డిఇ

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉమాను పరామర్శిస్తున్న ఎంఎల్ఎ సత్యనారాయణ

దోమల వ్యాప్తిని పూర్తిగా నివారించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

వివిధ రకాల దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగ్యూ తదితర జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా వ్యాధి నివారణాధికారి నక్కా వెంకటేశ్వరరావు సూచించారు. సోమవారం మండలంలోని జొన్నాడ ఇటుక బట్టీలను, పెదపళ్ల పిహెచ్‌సిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు దోమల వ్యాప్తిని నివారించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. నిరంతర ప్రక్రియ క్రింద జ్వర సర్వే నిర్వహించి తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులతో అన్నారు. బట్టీల వద్ద నివాసం ఉండే వారికి ఆరోగ్య సూత్రాలను నిత్యం బోధించాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సాయి కిషోర్, హెల్త్ ఎడ్యుకేటర్ రాజా అక్కులు, ఎంఎస్ఎన్ రెడ్డి, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఉమ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయానికి డ్రోన్ సాంకేతికత

ప్రజాశక్తి-అమలాపురం

డ్రోన్ టెక్నాలజీతో అన్నదాతకు ఆసరాగా నిలవాలని ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసిందని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో అభ్యుదయ రైతులు డ్వాక్రా సంఘాల సభ్యులు వ్యవసాయ డిగ్రీ పొందిన విద్యార్థులు మూడు కేటగిరీలలో 134 మందికి కర్నూలు ట్రిపుల్ ఐటి డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ సాంకేతిక ప్రతినిధులు కృష్ణ నాయక్ నేతత్వంలోని ఐదుగురు సభ్యుల బృందం ఈ నెల 7వ తేదీ నుండి 11వ తేదీ వరకు చేపట్టనున్న వ్యవసాయ రంగంలో డ్రోన్లు వినియోగంపై అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రథమంగా కోనసీమ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. వ్యవసాయ పనులు మరింత సులువుగా చేపట్టేలా ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. మూడు నెలల క్రితమే ప్రోగ్రాం డిజైన్ చేశామని తెలిపారు. మండలానికి ఆరుగురు చొప్పున శిక్షణ కోసం ఎంపిక చేసినట్టు తెలిపారు. వ్యవసాయ రంగంలో ఖర్చులు తగ్గించుకునేందుకు డ్రోన్ల వినియోగం పెంచుకోవాల్సిన ఆవశ్యకత ప్రభుత్వం గుర్తించి ఆ దిశగా చర్యలు చేపట్టిందన్నారు. స్థానిక జిఎంసి బాలయోగి స్టేడియంలో ప్రయోగాత్మకంగా డ్రోన్ ఫ్లయింగ్ విధానాలపై అవగాహన పెంపొందించి తదుపరి వ్యవసాయ క్షేత్రంలో అవగాహన కల్పిస్తారన్నారు. డిఆర్‌డిఎ పీడీ సాయినాథ్ జై చంద్రగాంధీ మాట్లాడుతూ తొలి దశలో 8 డ్రోన్లను జిల్లా సమాఖ్య నిధుల నుండి కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బోసు బాబు, డిపిఎం గణపతి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

జనసేనలో భగ్గుమన్న విబేధాలు

ప్రజాశక్తి-అమలాపురం

జనసేన పార్టీలో గ్రూపుల విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. జనసేన నాయకుడిపై దాడి చేసిన సంఘటనలో ఆ పార్టీ అయినవిల్లి మండల అధ్యక్షుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అయినవిల్లిలో పార్టీ నాయకుడు తోలేటి ఉమపై పార్టీ మండల అధ్యక్షుడు పోలిశెట్టి రాజేష్, ఆయన అనుచరులు దాడి చేశారు. ఆదివారం అర్ధరాత్రి రాజేష్, అనుచరులు ఉమ ఇంట్లోకి చొరబడి కర్రలతో దాడి చేశారు. అడుకోబోయిన ఉమ భార్యపై కూడా వారు దాడి చేయడంతో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి

బాధితులకు ఎంఎల్ఎ గిడ్డి పరామర్శ

అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తోలేటి ఉమా, ఆయన భార్యను ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ సోమవారం పరామర్శించారు. సంఘటనకు సంబంధించి విచారణ జరిపించి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఎంఎల్ఎ తెలిపారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లావ్యాప్తంగా వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కపిలేశ్వరపురం ఆరోగ్య నియమాలు సక్రమంగా పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని సాగించవచ్చని పిహెచ్‌సిల వైద్యాధికారులు డాక్టర్ పి.రత్నకుమారి, డాక్టర్ విజయ దీపిక, డాక్టర్ రాకేష్ చౌదరి అన్నారు. అంగర, అచ్యుతాపురం, వాకతిప్ప, పిహెచ్‌సిల వైద్యాధికారుల ఆధ్వర్యంలో పిహెచ్‌సిల వైద్య సిబ్బంది ర్యాలీ, మానవహారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, ఆరోగ్య అలవాట్లు తదితర అంశాలపై ప్రజలకువిస్తతంగా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు, ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జె.మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, ఎంపిహెచ్ఇఒ గోపాలకృష్ణ, ఎంపిహెచ్ఎస్.శ్రీధర్ పాల్గొన్నారు.

మండపేట పిఎంపి అసోసియేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి పేర్కొన్నారు. ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యలయం వద్ద ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరం రాజేష్ డయాబెటిస్ అండ్ ఎండోక్రైన్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని చైర్‌పర్సన్ పతివాడ ప్రారంభించారు. మున్సిపల్ సిబ్బంది, పట్టణ పోలీసులకు, పట్టణ ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పిఎంపి అసోసియేషన్ అధ్యక్షులు కోన సత్యనారాయణ, బళ్ల వెంకట రమణ, ఇరవాడ రవికుమార్, వానపల్లి కనకరాజు, మారిశెట్టి సత్యనారాయణ, మండిపూడి చంద్రశేఖర్, పుత్సల కాశీ, పిల్లా సతీష్, నరేష్, గాలింకి నాగేశ్వరరావు, జోగా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఐ.పోలవరం గుత్తెనదీవి సాయిరామ్ విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజ్ఞ సాహితీ వ్యవస్థాపకులు డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన వైద్య ఆరోగ్య శాస్త్ర దిగ్గజం డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యానికేతన్ స్కూల్ కరస్పాండెంట్ సలాది శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టర్లు, నర్సులు, ఆరోగ్య కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పిఎంపి వైద్యులు ఆకుల సత్తిబాబు, గాలిదేవరమూర్తిని వైద్యరత్న అవార్డులతో సన్మానించారు. సావిత్రీబాయి పూలే అవార్డులతో అంగన్‌వాడీ టీచర్స్‌ను మెమెంటోలతో సత్కరించారు. పోటీల్లో పాల్గొన్న విజేతలకు పుల్లెపు వెంకటేశ్వరరావు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో నాటి ధనరాజు, బత్తుల శారద, బొమ్మిడి నాగేంద్రవర్మ, ప్రిన్సిపల్ మాగాపు సీతారత్నం, దుగుదుర్తి వీరలక్ష్మి, అంగన్‌వాడీలు పి.వెంకటలక్ష్మి, బివివి.సత్యనారాయణమ్మ, ఎం.వెంకటలక్ష్మి, డి.మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు శారీరక శ్రమ, మానసిక ఉల్లాసంతోనే పరిపూర్ణమైన ఆరోగ్య, జీవన భాగ్యాన్ని సాధించవచ్చునని పిహెచ్‌సి వైద్యాధికారులు డి.సాయికిషోర్, కె.శ్రీకాంత్ అన్నారు. చొప్పెల్ల, పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపిహెచ్ఇఒ కె.జ్యోతికుమార్, హెచ్ఇఒలు ఎవివి.రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

రామచంద్రపురం ద్రాక్షారామ భీమేశ్వర దంత వైద్యశాల వైద్యులు డాక్టర్ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ మన శరీర ఆరోగ్యానికి మూల కారణం నోటి ఆరోగ్యమని తెలిపారు. ఎన్నో అనారోగ్య సమస్యలు, ప్రధానంగా నోటిలో చిగురు వాపులు గుండె జబ్బులకు సంకేతం అన్నారు. ఈ కార్యక్రమంలో రోగులకు నోటి పరీక్షలు నిర్వహించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు.

మండపేటలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పతివాడ నూకదుర్గారాణి

కపిలేశ్వరపురంలో అవగాహన కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది

ఆలమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రామచంద్రపురంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కార్టూ'నిజం'

ఆంధ్రప్రదేశ్ ఎదుగుతోంది: సీఎం

ఏంలాభం? మనం ఎదగటం లేదుగా?!

నేరాలు ఘోరాలు

రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వాహనాలు

21 క్వింటాళ్ల బియ్యం సీజ్

ప్రజాశక్తి - రాజానగరం

పౌర సరఫరాల శాఖ చౌకధరల దుకాణాల ద్వారా పేదలకు పంపిణీ చేస్తున్న బియ్యాన్ని అక్రమంగా మూడు వాహనాల్లో తరలిస్తుండగా పట్టుకున్నామని రాజానగరం డిప్యూటీ తహశీల్దార్ గొలుగూరి బాపిరాజు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.9,93,600 ఉంటుందన్నారు. జాతీయ రహదారి జిఎస్ఎల్ మెడికల్ కళాశాల సమీపంలో మూడు వాహనాల్లో రేషన్ బియ్యం తరలిస్తున్నారని సమాచారం అందడంలో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. మొదటి వాహనంలో 15,390 కేజీల బియాన్ని, రెండో వాహనంలో 3,670 కేజీలు, మూడోవాహనంలో 2,540 కేజీల బియ్యాన్ని పట్టుకున్నారు. గొల్లప్రోలుకు చెందిన ఆకుల స్వామి, పెద్దాపురం మండలం గోరంట్ల గ్రామానికి చెందిన కోరుకొండ అబ్బిరాజు, కోన బాలరాజులను అదుపులోకి తీసుకున్నారు. ఈ బియ్యం విలువ సుమారు రూ.9,93,600 ఉంటుందన్నారు. బియ్యాన్ని, మూడు వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేశామని తెలిపారు.

బైకుల చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సిఐ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉప్పాడ నాయకర్ కాలనీకి చెందిన సూరాడ బాబు(20), చింతకాయల ఏసుబాబు (21) అరెస్టు చేసి వారి నుంచి 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. గొల్లప్రోలు, తొండంగి, పిఠాపురం టౌన్, కాకినాడ మండలాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన కేసుల్లో వీరు ముద్దాయిలుగా గుర్తించినట్లు తెలిపారు వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకి తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ వెంకటేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వలోకి దూసుకెళ్లిన స్కూల్ వ్యాన్

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తి గ్రామంలో ఒక స్కూల్ వ్యాన్ అదుపుతప్పి కాలువలోకి దూసుకుపోయింది. పట్టణంలోని బైపాస్ రోడ్ లోని పిఎంఆర్ స్కూల్ వ్యాన్ విద్యార్థులను ఎక్కుంచుకుని చెందుర్తి వెళ్లి తిరిగి మరో గ్రామానికి వెళ్లే క్రమంలో 10 మంది విద్యార్థులతో అదుపుతప్పి కాలువలో తిరబడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. మరో ఇద్దరు విద్యార్థులు కాలువలో నీటిని తాగడంతో వారిని పిఠాపురంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. స్కూల్ ప్రిన్సిపల్ కె.కుమార సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం-వాలు తిమ్మాపురం రహదారిలోని పట్టాభి అగ్రో ఫుడ్స్ ఫ్యాక్టరీ డ్రెయిన్లో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించింది. సంఘటనాస్థలాన్ని సిఐ విజయశంకర్, ఎస్ఐ మౌనికి పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి గాయాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం...పట్టణంలోని మార్కండేయపురంకి చెందిన పిల్లి అప్పారావు మేకలు కొనుగోలు చేయడానికి మోటార్ సైకిల్పై వెళుతుండగా గొల్లప్రోలు బైపాస్ మార్కెట్ యార్డ్ చెక్ పోస్ట్ వద్ద పిఠాపురం నుంచి కత్తిపూడి వెళుతున్న కారు అతివేగంతో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పిల్లి అప్పారావు తీవ్ర గాయాలపాలయ్యాడు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్కు తరలించారు. బాధితుడు కుమారుడు పిల్లి ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

భూమి పూజ చేస్తున్న ఎంఎల్ఎ అశోక్

అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో ఎంఎల్ఎ నిధులు రూ. 51లక్షలతో చేపట్టే పనులకు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో డంపింగ్ యార్డు సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నానని, ఈ విషయంలో ప్రజల పడుతున్న తీవ్ర ఇబ్బందులు తాను అర్థం చేసుకోగలనని అన్నారు. సావిత్రినగర్లో రూ.8.67 లక్షలతో సిసి రోడ్డు, డ్రెయిన్, దరియాలతిప్పలో రూ.9.25 లక్షలతో క్రికెట్ ప్రాకీస్ పిచ్, రూ.13.07 లక్షలతో గుమ్మల్లా వీధి నుంచి బెజవాడవారి వీధి వరకు సిసిరోడ్లు, డ్రెయిన్లు, రూ.6.87 లక్షలతో స్టాబోర్డు కాలనీ నుంచి బెజవాడ గార్డెన్స్ వరకు రహదారి, రూ.12. 13 లక్షలతో సంతోష్ నగర్ లో సిసిరోడ్డు, రూ.4.54 లక్షలతో వికె కాలనీ, మెట్టకూరులో రీడింగ్ రూమ్ లకు భూమిపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్ఛార్జ్ కమిషనర్ కె.రామకృష్ణ, పిడబ్ల్యూడి అధికారులు పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తుల మార్కెటింగ్పై సమీక్ష

ప్రజాశక్తి-అమలాపురం

సేంద్రియ వ్యవసాయంతోనే భూసార సంరక్షణ, ఆరోగ్య భద్రతతో పాటు మానవాళి మనుగడకు భరోసా ఉంటుందని జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో వ్యవసాయ ఉద్యాన మార్కెటింగ్ రైతు సాధికారత, మున్సిపల్, స్వచ్ఛంద సంస్థలు డ్వాక్రా మెప్మా రిసోర్స్ పర్సన్లు, రైతు బజార్ ఎస్టేట్ అధికారులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులతో సేంద్రీయ ఉత్పత్తుల సాగు మార్కెటింగ్ వినియోగంపై ఆమె సమీక్షించారు. పెరుగుతున్న ఆరోగ్య సమస్యలకు పరిష్కారం సహజ వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలను పండించడమే ఏకైక మార్గమని తెలిపారు. భవిష్యత్తులో పెట్టుబడి రహిత ప్రకతి సేంద్రియ పద్ధతిలో సాగును అవలంబించాలన్నారు. పట్టణ ప్రాంతాలలో తడి చెత్త వ్యర్థాలను కంపోస్టుగా రూపొందించుకుని ఆ కంపోస్టుతో టెర్రస్ గార్డెన్స్ పెంచుకునే గుడ్ ప్రాక్టీసెస్ అవలంబించే దిశగా రిసోర్స్ పర్సన్లు కృషి చేయాలని ఆదేశించారు. స్వచ్ఛంద సంస్థలు వీటి పెంపకానికి అనువైన సాంకేతికతను మెన్యూర్ తయారీ విధి విధానాలపై తగిన సహకారం అందిస్తారన్నారు. తద్వారా పట్టణాలలో వ్యర్థ పదార్థాలు తగ్గటమే కాక ప్రజలకు నాణ్యమైన ప్రకతి కూరగాయలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, మార్కెటింగ్ అధికారి కె.విశాలాక్షి, దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, రైతు సాధికార సంస్థ ప్రతినిధి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ కెవివిఆర్.రాజు, రిసోర్స్ పర్సన్ పూర్ణిమ, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి నిషాంతి

'చెత్త నుంచి సంపద' పనుల వేగవంతం

ప్రజాశక్తి - ఆలమూరు

చెత్త నుండి సంపద సృష్టి పనులు వేగవంతం చేశామని ఇన్ఛార్జి డిఎల్పిఒ, ఎంపిడిఒ ఐ.రాజు అన్నారు. మండలంలోని నవాబుపేట, జొన్నాడ, చెముడులంక గ్రామ పంచాయతీలలో ఇంటింటికీ చెత్త సేకరణపై సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందికి చెత్త నుండి సంపద తయారీపై ఇప్పటికే శిక్షణ నిర్వహించామన్నారు. తడి చెత్త, పొడి చెత్త సేకరించే విధానాన్ని మండలంలోని ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కూడా కల్పించామన్నారు. సేకరించిన చెత్త నుంచి సంపద ఏ విధంగా తయారు చేయాలనే అంశంపై ప్రత్యేక శిక్షణ మండల పరిధి అన్ని గ్రామాల పంచాయతీల సిబ్బందికి ఇచ్చామన్నారు. దీని వల్ల గ్రామంలో పరిశు భ్రతతో పాటు పంచాయతీలకు ఆదాయం కూడా సమకూరుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాంబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ పెద్దిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ రాజు

నూకాంబిక ఆలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చింతలూరు శ్రీనూకాంబికా అమ్మవారి ఆలయ అభివృద్ధికి గుమ్మిలేరుకు చెందిన పారిశ్రామికవేత్త ముత్యాల వీర భాస్కరరావు, కృష్ణవేణి దంపతులు సోమవారం రూ.1,00,116 విరాళం అందజేశారు. తమ కుటుంబ సభ్యులైన ముత్యాల విజయకిరణ్, శ్రీవల్లి, ప్రమోద్ శౌర్య, ప్రణీత్ రామ్, ఉండవల్లి వీరవెంకట గోపీ చౌదరి, విజయలక్ష్మి, నిక్షిత్, ఆద్యలతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గాలిగోపురం నిర్మాణం నిమిత్తం ఈ మొత్తం విరాళాన్ని వినియోగించమని కోరుతూ దేవస్థానం ఇఒ ఉండవల్లి వీర్రాజు చౌదరి, ఉత్సవ కమిటీ చైర్మన్ గన్ని వెంకట్రావు, కమిటీ సభ్యులకు దాతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వైట్ల గంగరాజు, వైట్ల శేషుబాబు, వాకా గోవిందరాజు, దాసరి సుబ్బారావు, పులుగుర్త పవన్ కుమార్, తాళ్ల రాజు పాల్గొన్నారు.

ఇఒకు నగదు అందజేస్తున్న భాస్కరరావు దంపతులు

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - గండేపల్లి

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేసేందుకు యుటిఎఫ్ చేస్తున్న కృషిని ఎంపిపి చలగల దొరబాబు అభినందించారు. సోమవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని మురారి గ్రామంలో ప్రయివేటు పాఠశాలలు వద్దు...ప్రభుత్వ పాఠశాలలు ముద్దు అంటూ ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపితోపాటు, గ్రామ సర్పంచ్ కుక్కల ఆనంద్, ఉప సర్పంచ్ జాస్తి వసంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కన్నా ముందు యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలను బలోపేతానికి కృషి చేయడం అభినంద నీయమన్నారు. సోమవారం ఒక్కరోజు 21 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల కృషిని ఎంఇఒ కెహెచ్.నాయక్, హెచ్ఎం ఎన్.అమ్మాజీ, యుటిఎఫ్ నాయకులు లక్ష్మీదేవి, రాజబాబు, పివివి.సత్యనా రాయణ, పి.నాగేశ్వరరావు, ఆర్.శ్రీనివాసరావు, ఎం.సుభాష్, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

చలివేంద్రాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - సామర్లకోట

వేసవి దష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలను ప్రజలు ఉపయోగించు కోవాలని ఎస్ఐ రమేష్బాబు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక గాంధీనగరం లారీ స్టాండ్ రోడ్డులో మైత్రి యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఎండల తాపం అధికంగా ఉన్నందున పాదాచారులు, ప్రజలు వడ దెబ్బకు గురికాకుండా మైత్రి సంఘం ఏర్పాటు చేస్తున్న చలి వేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తుమ్మల ప్రసాద్, మందపల్లి చినబాబు, మంచెం సాయిబాబు, షఫీయుల్లా, రజాల శ్రీను, మొటూరి నగేష్, మడగల శ్యాంకుమార్, ఉప్పులూరి బాపిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

ప్రజాశక్తి - శంఖవరం

అగ్ని ప్రమాదానికి గురైన రెండు కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని వైసిపి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు కోరారు. సోమవారం మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో అగ్నిప్రమాద బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలైన రెండు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రాము కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - కోటనందూరు

వైసిపి నాయకుడు కురందాసు రాము కుటుంబ సభ్యులను తుని నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షులు లంక కృపానందం, ఇతర నాయకులు సోమవారం పరామర్శించారు. రాము తల్లి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో రామును వారు పరామర్శించారు. సర్పంచులు గరిసింగ దొరబాబు, జగటాల వీరబాబు, తరిపే సత్తిబాబు, కోఆప్షన్ సభ్యులు జగటాల కోటసత్తిబాబు, నాయకులు గారా శ్రీను, సూరిబాబు, విజయ్, నేతల శివ, బండి నాని, ప్రసాద్ పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ

బధిర విద్యార్థులకు మంజూరు అయిన మొబైల్ ఫోన్లను కలెక్టర్ షాన్మోహన్ సగిలి సోమవారం అందజేశారు. జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహకార సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్లో ఆరుగురు బధిరులకు రూ.15 వేలు విలువైన మొబైల్ ఫోన్లు ఉచితంగా అందజేశారు. జడ్పి సిఇఒ లక్ష్మణరావు, సూపరింటెండెంట్ శ్రీరామ్ పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎస్ఆర్ కిట్లు అందిస్తాం

ప్రజాశక్తి - యంత్రాంగం

కిర్లంపూడి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సరాఫరా చేయబోయే స్టూడెంట్ కిట్లు భద్రపరిచే స్టాక్ పాయింట్ను రాష్ట్ర పరిశీలకులు బి.భారతి సోమవారం పరిశీలించారు. కొక్కొండ రామశేషగిరి రావు పంతులు హైస్కూల్లో ఉన్న స్టాక్ పాయింట్ను ఆమె పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ పరిశీలనలో జిల్లా సమగ్ర శిక్ష సిఎంఒ చామంతి నాగేశ్వరరావు, ఎంఇఒలు టి.జోసెఫ్, మక్కా చిన్నారావు, హెచ్ఎం జిసిహెచ్ఎస్.ప్రకాశరావు, సిఆర్పిలు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** పాఠశాలలు తెరిచేనాటికి ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి 'విద్యార్థి మిత్ర కిట్లు' అందజేస్తామని ఎస్ఎస్ఎ రాష్ట్ర పరిశీలకులు బి.భారతి అన్నారు. సోమవారం స్థానిక ఎస్ఎస్ఆర్ కిట్స్ స్టాక్ పాయింట్లను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎ జిల్లా పరిశీలకులు చామంతి నాగేశ్వరరావు, ఎంఇఒలు బి.అబ్బాయి, కె.వరలక్ష్మి, హెచ్ఎం గణపతిరావు, సిఆర్పిలు, పిటిఐలు పాల్గొన్నారు. **సామర్లకోట** పాఠశాలను తెరిచి రోజునే విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ అందిస్తామని రాష్ట్ర పరిశీలకులు బి.భారతి తెలిపారు. స్థానిక జిటిడబ్ల్యు పాఠశాలలోని స్టాక్ పాయింట్ను ఆమె సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుచున్న బాల బాలికలకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, బ్యాగులు, బెల్టు, బూట్లు, డిక్షనరీలు తదితర వస్తువులు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు పి.పుల్లయ్య, వై.శివరామకృష్ణయ్య, హెచ్ఎం ప్రసాద్ పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో స్టాక్ పాయింట్ను పరిశీలిస్తున్న భారతి

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

కాకినాడ : గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని డాక్టర్ పుల్ల దేవిస్వప్నిక అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ ఆధ్వర్యంలో నగరంలోని రాగంపేటలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలతో సమావేశం జరిగింది. యూనియన్ నాయకులు సి.వెంకటరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ గర్భిణులు పండ్లు, ఆకుకూరలు, మాంసం కృతులను సమృద్ధిగా తీసుకోవాలని, గుడ్లు, పాలు క్రమం తప్పకుండా ప్రతిరోజు తీసుకోవాలన్నారు. బాలింతలు అన్ని రకాల ఆహారాన్ని తీసుకోవచ్చని, బిడ్డకు ఆరు నెలలు వచ్చేవరకు తల్లిపాలను ఇవ్వాలన్నారు.

ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ, మండల పరిధిలో ఏర్పాటు చేసిన పలు ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాలను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. సోమవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో లూథరన్ హైస్కూల్లోనూ, మండల పరిషత్ ఆధ్వర్యంలో కాండ్రకోటలో ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి, ఎంపిడిఒ డి.శ్రీలలిత అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభల్లో ఎంఎల్ఎతోపాటు, కుడా చైర్మన్ తుమ్మల బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చినరాజప్ప మాట్లాడుతూ మహిళల ఆర్థిక, సామాజికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు, టిడిపి మండల అధ్యక్షులు కొత్తిం వెంకట శ్రీనివాసరావు, టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రంది సత్యనారాయణ, తూతిక రాజు, నాయకులు ఎలిశెట్టి చక్రప్రకాష్, తోట రామకృష్ణ, పేకేటి వెంకటేశ్వరరావు, చాగంటి బుజ్జి, పల్లా రవి, పాల్గొన్నారు.

రోడ్ల పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - తాళ్లరేవు

కోరంగి పంచాయతీ బొడ్డు చిన వెంకటాయపాలెం, పాత కోరంగి గ్రామాల్లో నిర్మించే రోడ్ల పనులకు ఎంపిపి రాయుడు సునీత సోమవారం శంకుస్థాపన చేశారు. ప్రజల విజ్ఞప్తి మేరకు మండల పరిషత్ నుంచి ఆయా పనుల కోసం రూ.16 లక్షల నిధులు కేటాయించి పనులను ప్రారంభిస్తున్నట్లు ఎంపిపి తెలిపారు. రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారునికి సూచించారు. నిధులు మంజూరు చేసిన ఎంపిపికి వైస్ ఎంపిపి కోపనాతి లలిత కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల మంగేష్, జడ్పిటిసి దొమ్మేటి శామ్యూల్సాగర్, ఎంపిటిసి సభ్యురాలు పోతుల రత్నకుమారి, మాజీ సర్పంచ్ బర్రె లక్ష్మీ నరసింహరాజు, ఎస్బి కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, నాయకులు రాయుడు గంగాధర్, కోడూరి సత్యనారాయణ, పొన్నమండ రామలక్ష్మి, వుంగరాల వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి విజెవి.రమణ పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

మార్కెట్లో డ్రెయినేజీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-కాట్రేనికోన

కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని మార్కెట్ ప్రాంతంలో డ్రైనేజీ నిర్మాణ పనులను విప్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు స్థానిక నాయకులతో కలిసి సోమవారం పరిశీలించారు. మార్కెట్ ప్రాంతం కొద్దిపాటి వర్షానికే నీట మునిగిపోవడంతో రూ.కోటీ పది లక్షల నిధులతో ఆధునీకరణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ ఇంజినీరింగ్ సిబ్బందిని పనులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంజనీరింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో దాట్ల పవన్, పిఎస్ఎన్ రాజు, రవి వర్మ, వాసంశెట్టి రాజేశ్వరరావు, బండారు ఏసు, కదలి సత్యనారాయణ, కముజు రాంబాబు, వెంట్రు సుధీర్ తదితరులు ఉన్నారు.

చెరువుల తవ్వకాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కాట్రేనికోన

కందికుప్ప పంచాయతీ మిలటరీపేటలో రొయ్యల చెరువుల అక్రమ తవ్వకాలపై సమస్యల పరిష్కార వేదికలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. చెరువుల నీరు కాలుష్యంతో చర్మవ్యాధులు వస్తున్నాయని స్థానికులు కాశి ఆనంద్ కుమార్ అధర్వంలో పలువురు గ్రామస్తులు వాపోయారు. అక్రమ చెరువుల తవ్వకాల విషయం తెలుసుకున్న సిపిఎంం నాయకులు దుర్గాప్రసాద్ కలెక్టరేట్ వద్ద గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. భవిష్యత్తులో గ్రామస్తులు చేసే ప్రతి ఉద్యమానికీ పార్టీ పరంగా ముందుండి అక్రమ చెరువు తవ్వకాలపై పోరాడుదాం అన్నారు.

అర్జునరావుకు ఎంఎల్ఎ దాట్ల పరామర్శ

ప్రజాశక్తి-కాట్రేనికోన

కాట్రేనికోన రామాలయం వీధిలో రిటైర్డ్ డిఎస్పి విత్తనాల అర్జున రావు భార్య మంగాయమ్మ ఇటీవల మరణించడంతో ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు సోమవారం అర్జునరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అయన వెంట దాట్ల పవన్, పిఎస్ఎన్.రాజు, బండారు యేసు, వాసంశెట్టి రాజేశ్వరరావు, రిటైర్డ్ ఎస్ఐ కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, కె.రవి ఉన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంతం

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. అధ్యక్షునిగా ఉండవల్లి గోపాలరావు, ఉపాధ్యక్షునిగా గోవర్ధనం మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు వరాహ నరసింహమూర్తి, సంయుక్త కార్యదర్శులుగా పివిఎస్.జానకి, ఎన్వి.శేషు కుమార్, కోశాధికారిగా చింతపల్లి శ్రీనివాస్, క్రీడలు సంస్కృతిక విభాగానికి కార్యదర్శిగా సాదే నారాయణరావు, మహిళా ప్రతినిధిగా లకాని పద్మ కమల కుమారి ఎన్నికయ్యారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-కె.గంగవరం

కె.గంగవరం మండలంలో సోమవారం బిసి కార్పొరేషన్, కాపు కార్పొరేషన్, ఇబిసి అభ్యర్థుల రుణాలకు సోమవారం బ్యాంక్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలో మొత్తం 2000 వరకు దరఖాస్తులు రాగా 1600 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. బ్యాంకులు ఎంతమందికి రుణాలు మంజూరు చేస్తాయో పూర్తిగా తెలియకపోవడంతో ఇంటర్వ్యూలకు వచ్చిన అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. మండలానికి ఎన్ని లోన్లు మంజూరు అవుతాయనేది పూర్తిగా క్లారిటీ రాకపోవడంతో దరఖాస్తుదారులు నిరోత్సాహానికి గురయ్యారు.

కనకదుర్గమ్మ అమ్మవారికి వసంతోత్సవం

ప్రజాశక్తి-మామిడికుదురు

పెదపట్నంలంకలో కొలువుదీరిన కనకదుర్గమ్మ అమ్మవారికి సోమవారం వసంతోత్సవం పూజలు ఘనంగా నిర్వహించారు. ఏకాదశ రుద్రాభిషేకం, చామంతి పూజ, లలిత హోమం నిర్వహించారు.

దస్తావేజులు పోయినవి

గుమ్మాపు వెంకన్న, తండ్రి: సందయ్య, ఇంటి నెం.2-14, అంబేద్కర్ వీధి, అట్లపాడు, నిడదవోలు మండలం, తూ.గో.జిల్లా అను నేను నా ఒరిజినల్ డాక్యుమెంట్ నెం:294/1978రు గల డాక్యుమెంట్ను టూ వీలర్ మీద తీసుకొని నిడదవోలు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళు తుండంగా దారిమధ్యలో పడిపోయినవి. ఎంత వెదికిననూ దొరకలేదు. కావున ఎవరికైననూ దొరికిన ఎడల పైన తెలిపిన చిరునామాకు అందజేయగలరు.

ఒరిజినల్ లింకు దస్తావేజులు పోయినవి

నా క్లయింటు కృష్ణా జిల్లా, వుయ్యూరు వాస్తవ్యులు **శ్రీ మదిరి కార్నెలియస్** గారి **కుమారుడు శ్రీ వెంకట శశికుమార్** ఇచ్చిన సంజాయిషీ ప్రకారం నా క్లయింటు యొక్క ఒరిజినల్ లింకు దస్తావేజులు (1) **8045/2014, Dt. 20-10-2014, SRO,** భీమవరం, (2) **4218/1987, Dt. 25-11-1987, SRO,** భీమవరం నెంబర్లు గల ఒరిజినల్ లింకు దస్తావేజులు నా క్లయింటు కవరులో పెట్టకొని **ది. 28-3-2025వ** తేదీన రాజమండ్రి ప్రకాష్ నగర్లోని ఉన్న జంబో జిరాక్స్ వద్ద జిరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా రాజమండ్రి ప్రకాష్ నగర్ రౌండ్ పార్క్ వద్ద పడిపోయినవి. ఎంత వెతికిన కనిపించలేదు. కనుక ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రసుకు తెలియపర్చవల సిందిగా కోరుచున్నాము. తెలియపర్చిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును.

యిన్నమూరి బాలసుబ్రహ్మణ్యం
దినేష్ రామినీడి, అడ్వకేట్స్
డో.నెం. 31-1-2/1, జె.పి.రోడ్,
రాజమండ్రి, సెల్: 97008 45909

CHANGE OF NAME

I, OGURI INDIRA (New Name), W/o JILLELLA ANIL KUMAR, Resident of Door No. 1-103, Mori Village, Sakhinetipalli Mandal, Dr. B.R. Ambedkar Konaseema District , AP. , I Hence by declare that my Name has been changed from **JILLELLA INDIRA** (Old Name) to **OGURI INDIRA** (New Name). Hence all my documents and correspondence will continue With My New Name of **OGURI INDIRA.**

ఇంటర్ మార్క్స్ లిస్ట్ పోయినది

గుడివాడ మండలం, గుడివాడ గ్రామ కాపురస్తురాలు, **గూడపాటి జయ శ్రీ, తండ్రి: కిరణ్** అను నాయొక్క **పదవ తరగతి ఒరిజినల్ మార్క్స్ లిస్ట్ ది.01.04.2025వ తేదీన జిరాక్స్ తీయించుకొని నిడదవోలు నుండి గణపతి సెంటర్ దారి మార్గంలో స్కూటీమీద వెళుచుండగా పడిపోయినది. కావున ఎవరికైనా దొరికినచో నాకు అందజేయగలరు.**

గూడపాటి జయ శ్రీ, తండ్రి: కిరణ్
ఫోన్: 9966911740

గ్రామపంచాయతీ కార్యాలయం, సూర్యారావుపేట

టెండరు నోటీసు

ఆ.క. నెం.04/2025 తేది.04-04-2025

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆలమూరు మండలంలోని సూర్యారావుపేట గ్రామపంచాయతీ 2025-2026 సం॥రంనకు ఈ దిగువ షెడ్యూల్ దాఖల సామాన్లు సప్లై చేయుటకు గాను టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లు ది. 17-04-2025 తేదీన ఉదయం 11.00 ల వరకు సూర్యారావుపేట గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ కార్యదర్శి వారిచే గాని, వారి అనుమతిని మరియొకరిచే గాని టెండర్లు తీసుకొనబడి సదరు సీల్డు టెండర్లు అదేరోజు మధ్యాహ్నం 2.00 గంటలకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలో తెరవబడును. టెండరు ప్రక్రియకు సంబంధించి ఇతర విషయముల కొరకు గ్రామపంచాయతీ పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును. ధరావత్తు చెల్లించని టెండర్లు స్వీకరించబడవు.

వ.నెం.	అయిటమ వివరములు	టెండర ధరావత్తు
1	2025-26 సంవత్సరమునకు గాను గ్రామపంచాయతీకి కావలసిన (పి.హెచ్. సామాగ్రి) ముగ్గు, బ్లీచింగ్, హైపోక్లోరైడ్ మొదలగు ప్రజారోగ్య సామాన్లు సప్లై చేయుటకు	రూ. 100/-
2	2025-26 సంవత్సరమునకు గాను గ్రామపంచాయతీకి కావలసిన (పి.డబ్ల్యు.ఎస్. సామాగ్రి) చేతి పైపులు మరియు కుళాయి విడి భాగములు సప్లై చేయుటకు	రూ. 100/-
3	2025-26 సంవత్సరమునకు గాను గ్రామపంచాయతీకి కావలసిన ఎలక్ట్రికల్ సామాగ్రి మరియు విడి భాగములు సప్లై చేయుటకు	రూ. 100/-
4	2025-26 సంవత్సరమునకు గాను గ్రామపంచాయతీకి కావలసిన నలుగురు స్వీపర్లు, ట్యాంక్ వాచరు - 1	రూ. 100/-

గమనిక: గ్రామపంచాయతీ నిధుల లభ్యతను బట్టి చెల్లింపులు చేయబడును.

సం/- **శ్రీమతి చింతపల్లి వెంకటలక్ష్మి**
సర్పంచ్, గ్రామపంచాయితీ, సూర్యారావుపేట
అమలాపురం మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

సం/- **శ్రీ కోట్ల హరేరామిరెడ్డి**
పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయితీ
సూర్యారావుపేట, ఆలమూరు మండలం

IN THE COURT OF HON'BLE V ADDL. JFCM :: KAKINADA
O.S. 28/2023

Between:
ADAPA RAMACHANDRA RAO
S/o. Surya Prakasa Rao,
D.No. 5-1, Dugguduru Village,
Kajuluru ...Plaintiff
and
BEJAWADA SRINIVASA RAO
S/o. Bapanna Naidu, Lab Assistant,
Balaji Clinic Lab, D.No. 7-3-10,
Bejawada Street, Yanam,
Pondicherry State ...Defendant

పై నెంబరు దావాలో ప్రతివాదిపై వాది దాఖలు చేసిన దావాలో ప్రతివాది కోర్టువారి నుంచి వచ్చిన దావా సమన్లు వగైరాలు తీసుకొనకుండా కాలయాపన చేయుటమూలంగా శ్రీ కోర్టువారి ఉత్తర్వులమేరకు ఈ ప్రకటన జారీచేయడమైనది.

సదరు దావా **ది. 17-04-2025 తేదీని పై కోర్టులో ఉదయం గం. 10-30 ని॥లకు** పిలువబడునని, ప్రతివాది స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై వివరణ యివ్వవలసినదని, లేని యెడల మీ పరోక్షంలో తీర్మానించబడునని తెలియజేయడమైనది.

అవసరాల నాగరాజు
ఆర్.ఎన్.వెంకట్
కాకినాడ **ఎం.మోహన్కుమార్**
ది. 04-4-2025 అడ్వకేట్స్, కాకినాడ

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
M.V.O.P. No. 616/2024
Between:
Palika Subramanyam ***...Petitioner***
AND
Nurukurthi Durga Rao and Others ***...Respondents***

R-1: Nurukurthi Durga Rao, S/o. Veeranna, Hindu, age 51 years, Driver of Lorry bearing No. AP 05 TD 0789, R/o. D.No. 68-10/A-22/1, Near Saranya School, Rajeswari Nagar, Gaigolupadu, Kakinada Rural, Kakinada District.

R-2: Kandregula Varalakshmi, S/o. Satyanarayana, Hindu, age 40 years, Owner of Lorry bearing No. AP 05 TD 0789, R/o. D.No. 4-83, Srinagar, Vakalapudi, Kakinada, Kakinada District 533 003.
...1, 2 Respondents

పై నెంబరు పిటిషన్లో 1, 2 రెస్పాండెంట్లు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 21-4-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

డి.కుమారి దేవి
రాజమండ్రి **ఆర్.మైథిలి**
07-4-2025 అడ్వకేట్స్, రాజమండ్రి